# రోడ్లు ఇలా.. వెళ్లేదెలా?

- అడుగడుగునా గుంతల రోడ్లు
- రాత్రి వేళలో కనిపించని గుంతలు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకుని అధికారులు, దృష్టిసారించని పాలకులు



పరిమాళపురం రోడ్డు మార్గంలో దారిపొడువుగా ఉన్న గుంతులు

**నారాయణపేట టౌన్:** పట్టణంలో రోడ్లపై ప్రయాణించాలంటే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరి అధ్వానంగా తయారవుతోంది. వర్షపునీరు నిలిచి గుంత ఎక్కడుందో తెలియక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పలు కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని సింగార్‌బేస్, మున్సిపల్ కార్యాలయంరోడ్, సరాఫ్‌బజార్, అంబేద్కర్‌చౌరస్తా, యాద్గీర్ రోడ్డుల్లో అడుగడుగునా గుంతల ఏర్పడడంతో తరుచుగా ప్రమాదాలవుతున్నాయని పలువురు వాపోతున్నారు. మిషన్ భగీథర పనులు దృశ్యా సీసీరోడ్లను ధ్వంసం చేపట్టి, అవే మట్టి, రాళ్లమూసి వదిలేయడంతో అవి తేలికపాటి వర్షాలకే పెద్ద గుంతలుగా మారి రోడ్లు అధ్వానంగా తయారవుతున్నాయి. కనీసం మరమ్మతులు ఏప్పటికప్పుడు చేయకపోవడం కారణంగా సమస్య నెలకొందని స్థానికులు ఆరోపిస్తున్నారు. టీచర్స్ కాలనీ, శ్యాసన్‌పల్లి రోడ్లు మార్గంలో డ్రైనేజీ స్లాబ్‌పై కంకర రాళ్ల తేలడంతో రాకపోకలు అంతరాయం ఏర్పడిన అధికారులు చూసిన పట్టించుకోవడం లేదంటున్నారు. ఎన్నో సంవత్సరాల కిందట వేసిన సీసీ రోడ్లు గుంతలమయంగా మారి కనీసం వాటిని పూడ్చివేసి సమస్య పరిష్కరించకపోవడంతో వాహనదారులు, పాదచారులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా పట్టణంలో పలు వీధులలో రోడ్లపై ఉన్న గుంతులను శాశ్వతంగా మూసివేసే విధంగా చర్యలు తీసుకోవాని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



పట్టణంలోని యాద్గీర్ రోడ్ వెళ్లే దారిలో గుంతలమయంగా ఉన్న రోడ్డు

### చర్యలు తీసుకుంటాం..

పట్టణంలో ప్రధానంగా నెలకొన్న రోడ్లపై ఉన్న గుంతలను పరిశీలించి మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుంటాం. నీరు నిల్వకాకుండా చేస్తాం. దశవారీగా పూర్తిస్థాయిలో గుంతలు లేకుండా సమస్య పరిష్కరిస్తాం.

– సునీత, మున్సిపల్ కమిషనర్, నారాయణపేట.

## ఉపాధి నిధులపై సామాజిక తనిఖీ



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ గోపాల్‌నాయక్

- రూ.44వేలు రికవరీకి ఆర్డీఓ ఆదేశాలు

**మరికల్:** జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద మండలంలో మూడేళ్లలో రూ.8.45 కోట్ల పనులు చేయగా, అధికారులు మాత్రం కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు కేవలం రూ.44.235 అవకతవకలు జరిగినట్లు తేల్చారు. మరికల్ మండలానికి సంబందించిన నవంబర్ 2020 నుంచి మార్చి 2023వరకు జరిగిన ఉపాధి పనులపై శనివారం రైతువేదిక ఆవరణలో వైస్ ఎంపీపీ రవికుమార్ అధ్యక్షతన సామాజిక తనిఖీ నిర్వహించారు. అంతకుముందు గ్రామాల వారీగా జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు చేపట్టి సేకరించిన వివరాలను సిబ్బంది, సామాజిక తనిఖీలో ఉన్నత అధికారులకు నివేదిక అందజేశారు. గ్రామాల వారీగా జరిగిన పనుల వివరాలను డీఆర్‌డీఏ గోపాల్‌నాయక్ ఫీల్డ్‌అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్లు, కార్యదర్శుల ద్వారా సమాచారం అడిగి తెలుసుకున్నారు. అయితే జిన్నారం ఫీల్డ్ అసిస్టెంట్ హరితహారం పథకం కింద మొక్కలు నాటకపోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్‌తో పాటు టెక్నికల్ అసిస్టెంట్, కార్యదర్శికి మెమో జారీ చేయాలని ఎంపీడీఓని ఆదేశించారు. రూ.8.45 కోట్ల పనులు జరిగితే, అధికారులు రూ.44,235 అవకతవకలు జరిగినట్లు తేల్చారు. వీటిని సంబంధిత ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు, కార్యదర్శుల నుంచి రికవరీ కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యశోదమ్మ, ఎంపీటీసీ గోపాల్, ఏపీఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్ సేవలను విస్తృతం చేస్తాం

**నారాయణపేట రూరల్ :** సామాజిక నిర్వహణలో ముందుండే లయన్స్‌క్లబ్ సేవలను మరింత విస్తృతం చేస్తామని స్థానిక క్లబ్ నూతన అధ్యక్షుడు, ఊట్కూర్ ఎంఈఓ వెంకటయ్య అన్నారు. పట్టణంలోని సింగార్‌బేస్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా నియమితులవ్వడంతో పాటు మున్సిపల్ వైస్‌చైర్మన్ లయన్ గవర్నర్‌గా ఎదగడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాబోవు రోజుల్లో విద్యారంగంలో తమవంతం సహకారం అందిస్తూ ప్రభుత్వ పాఠశాలలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మొల్గాన్‌జనార్ధన్, రవికుమార్‌గౌడ్, సాయినాథ్, అమరేష్, నర్సింహులు, సీఆర్‌పీ ఆరీఫ్, హెచ్ఎం చిన్నాయ్య, ఐఈఆర్‌పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.



విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ వెంకటయ్య

## మహిళలకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న మహిళలు

**దామరగిద్ద:** డ్వాక్రామహిళలకు వడ్డీలేని రుణాలివ్వాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళ సంఘం జిల్లా కన్వీనర్ గోవిందమ్మ, వ్య.సా.కా జిల్లా కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. మహిళసంఘం ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం వడ్డీలేని రుణాలు ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. మండలంలోని 1076 గ్రూపులకు చెందిన 11680 మహిళసభ్యులకు చెందిన శ్రీనిధి రుణాలు చెల్లించిన వడ్డీ దాదాపు రూ. 5 కోట్లు తిరిగి సంఘాల ఖాతాల్లో జమచేయాలన్నారు. మహేష్‌కుమార్, జములమ్మ, అమృతమ్మ, ఉషేంతమ్మ, హన్మంతు, నర్సింహ, వెంకటప్ప, మహిళసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

### గ్రామ అభివృద్ధికి సహకరించాలి



**నర్వ:** గ్రామ అభివృద్ధికి పంచాయతీ పరిధిలో పనిచేసే సిబ్బంది సహకరించాలని పెద్దకడ్మూర్ సర్పంచ్ శశిరేఖ అన్నారు. శనివారం పంచాయతీ కార్యాలయంలో గ్రామ పెద్దలను, ఆశా, అంగన్‌వాడీ సిబ్బందిని ఆమె శాలువాతో సత్కరించి మెమెంటోలు అందించారు. ఈ సందర్భంగా డీడీఎస్ఎస్ స్కీంకు ఎంపికైన అర్చకులు నర్సింహాయ్యను, గ్రామాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎం .లక్ష్మన్న, పంచాయతీ కార్యదర్శి అర్జున్‌లను ఆమె సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న రిలే దీక్షలు



**నారాయణపేట రూరల్:** మండలంలోని కోటకొండలో 67వ రోజు నిరసన దీక్షలు కొనసాగాయి. శనివారం మహిళా సంఘం సభ్యులు దీక్షలో కూర్చోగా సాధన సమితి సభ్యులు దండలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు యాదగిరి, చెన్నప్ప మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటు తర్వాత పరిపాలన సౌలభ్యం కోసం జిల్లాలు, మండలాలు చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించిన వెంటనే కోటకొండ గ్రామస్తులు అన్ని అర్హతలు ఉన్న తమ గ్రామాన్ని మండలం చేయాలని ప్రతిపాదనలు పంపినా తెలంగాణ ప్రభుత్వం తిరస్కరించిందని విమర్శించారు. ఇటీవల వరుసగా ఎన్నో అనవరమైన గ్రామాలను మండలాలుగా చేసిన కేసీఆర్ కోటకొండకు సైతం అవకాశం కల్పించాలని కోరారు.

### వివాహిత అదృశ్యం

**ఊట్కూరు:** మండలంలోని పులిమామిడిలో రెండు రోజుల క్రితం వివాహిత మహిళ బాలమ్మ అలియాస్ లక్ష్మీ అదృశ్యమైందని భర్త వెంకటేశ్ ఫిర్యాదు మేరకు శనివారం కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. రెండు రోజుల క్రితం లేడీస్‌కార్నర్‌కు వెళ్లివస్తానని ఇంటి బయలుదేరి తిరిగి రాలేదని పోలీసులు తెలిపారు. కుటుంబసభ్యులు వెతికిన ఆచూకి తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## ఆలయ భూముల్ని కాపాడుకుందాం



మాట్లాడుతున్న వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి

**కోస్గి:** అన్యాక్రాంతమవుతున్న ఆలయ భూములను కాపాడుకునేందుకు హైందవ సంఘాలు, కుల సంఘాలు ఏకమై సమిష్టిగా కృషిచేయాలని పలు సంఘాల నాయకులు సూచించారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక వేణుగోపాల స్వామి ఆలయ ఆవరణలో వీహెచ్‌పీ, పలు కుల సంఘాలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కోట్లాది రూపాయల విలువైన భూము లున్న వేణుగోపాల స్వామి ఆలయానికి దూపదీప నైవేద్యం లేని స్థితి ఉండటం దారుణమన్నారు. ఆలయాభివృద్ధితోపాటు ఆస్తుల పరిరక్షణకోసం కులాలకతీతంగా అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేయాలని తీర్మానించి 11 మంది సభ్యులతో నూతన హడ్‌హక్ కమిటీని ప్రకటించారు. ఈ అడ్‌హక్ కమిటీ పట్టణంలోని అన్నికులాల వారిని సంప్రదించి అందరి ఆమోదం మేరకు నూతన కమిటీని ఎన్నుకోవాలని తీర్మానించారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

### ఎంపీ గోరంట్ల మాధవ్‌ను కలిసిన దేవరి మల్లప్ప



**మక్తల్:** ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా హిందూపూర్ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను, రిటైర్డ్ జడ్జి కృష్ణప్పలను శనివారం మర్యాదపూర్వకంగా తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప ఎంపీని కలిసి శాలువాతో సన్మానం చేశారు. అనంతరం ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. ఆధ్వర్యంలో మాదాసి, మాదారి కుర్వలకు ఎస్సీకుల ధృవీకరణ సర్టిఫికెట్లను జారీచేస్తున్న అంశంపై చర్చించారు. కార్యక్రమంలో డాక్టర్ సాయిబాబా, టీచర్ శ్రీనివాస్, లింగప్ప, అంజప్ప, సాబు పాల్గొన్నారు.

## ఉచిత కరెంట్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే

**ఆత్మకూర్:** ఉచిత కరెంట్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ దేనని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పరమేష్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు తులసిరాజ్, జిల్లా కార్యదర్శి రహ్మతుల్లా అన్నారు. శనివారం మండలంలోని జూరాలలో ఇంటింటికి కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు కాని హామీలు ఇస్తూ ప్రజలను పక్కదోవపట్టిస్తుందన్నారు. తొమ్మిదేళ్ల గడుస్తున్నా రైతులకు రుణమాఫీ చేయాలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీ, రూ. 4వేలు పింఛన్, రూ.500లకే సిలిండర్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గంగ, మధు, తదితరులు ఉన్నారు.



జూరాలలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

### 25న బోనాల పండుగ

**అమరచింత:** మున్సిపల్ కేంద్రంలో ఈ నెల 25న పోచమ్మ దేవత బోనాల పండుగను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తాటికొండ రమేష్, మేస్త్రీ రాములు అన్నారు. శనివారం ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఉదయం 7 గంటలకు అమ్మవారికి అభి షేకాలు చేసి పండుగను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

## తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి



నర్వ: సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఎం

**నర్వ:** విద్యార్థుల చదువు బాధ్యతను ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని క్లస్టర్ హెచ్ఎం నర్సింహులు అన్నారు. శనివారం నర్వ, పెద్దకడ్మూర్ క్లస్టర్‌లలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచేందుకు ఇరువురు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. నిత్యం విద్యార్థుల ప్రగతిని, పాఠశాలలో ఉపాధ్యాయులు ఇచ్చిన హోంవర్క్‌ను ఇంటి వద్ద తల్లిదండ్రులు చేయిస్తే సత్ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాజేష్, ఆయాగ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**మక్తల్:** మండలంలోని దాసర్‌దొడ్డిలో శనివారం తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతినెల మూడవ శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు పాఠశాలలో ఉపాధ్యాయులు ఇచ్చిన హోంవర్క్‌ను ఇంటి వద్ద తల్లిదండ్రులు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మారుతి, రామ్‌కిరణ్, మహేశ్వరి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఊట్కూరు:** పాఠశాలల అభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని ఎంఈఓ వెంకటయ్య కోరారు. శనివారం నిడుగుర్తి, మల్లెపల్లి పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. నిడుగుర్తి పాఠశాలను ఆయన సందర్శించి మాట్లాడారు.. విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యేవిధంగా తల్లిదండ్రులు శ్రద్ధవహించాలని కోరారు. పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించేందుకు విద్యాశాఖ ఆధర్యంలో తొలిమెట్టు, మనఊరు– మనబడి, తదితర కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. విద్యాబివృద్ధికి ఉపాధ్యాయులతోపాటు విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం ఉండాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎంలు లక్ష్మారెడ్డి, నిర్సంగప్ప, ఎస్ఎంసీ చైర్మన్ నర్సింహులు, మగ్దూల్‌ఖాన్, ఉపాధ్యాయులు పద్మా, సునిత, వెంకటప్ప, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దాసర్‌దొడ్డిల్లో తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న హెచ్చెం గోపాల్ రెడ్డి



మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటయ్య

**కోస్గి:** తల్లిదండ్రుల భాగస్వామ్యం ఉంటే ప్రభుత్వ పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయని క్లస్టర్ జీహెచ్ఎం వెంకట్రాముడు సూచించారు. ఈ మేరకు శనివారం గుండుమాల్ మండల పరిధిలోని బోగారం జెడ్పీఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు.. పాఠశాలలో అమలు చేస్తున్న 45రోజుల ప్రత్యేక ప్రణాళిక, నిర్వాహణ వంటి అంశాలను తల్లిదండ్రులకు వివరించారు. తమ పిల్లలు విధిగా పాఠశాలకు వచ్చేలా చూడాలని, కొంత సమయం కేటాయించి విద్యార్థులకు పాఠశాలల్లో జరుగుతున్న పాఠాలను పర్యవేక్షించడంతో మరింత ఉన్నత ఫలితాలు ఉంటాయన్నారు. తమ పిల్లలు వందశాతం హాజరు సాధించేలా పర్యవేక్షిస్తూ రోజు పాఠశాలకు పంపాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సత్యనారాయణ, పీఎస్ హెచ్ఎం గిరిజా తోపాటు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

### ఈత మొక్కలు నాటాలి

**కోయిల్‌కొండ:** గ్రామాల్లోని చెరువు కట్టలపై ఈత మొక్కలను నాటేందుకు పంచాయితీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ జయరాములు సూచించారు. శనివారం రాంపూర్ చెరువు కట్టపై ఈత మొక్కలు నాటారు. గీత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఉచితంగా ఈత మొక్కలను అందిస్తోందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీవో నర్సయ్య, వీందర్ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె

**నారాయణపేట టౌన్:** పంచాయతీ కార్మికులకు శాపంగా మారిన జీవో నెంబర్ 51ని రద్దుచేసి మల్టీపర్పస్ విధానానికి స్వస్తిచెప్పాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం ఎదుట చేపడుతున్న కార్మికుల సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు.. 11వ పీఆర్సీ ప్రకారం కనీస వేతనం రూ.19 వేలు పెంచి కార్మికులను వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించాలన్నారు. కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కాశీనాథ్, జిల్లా కార్యదర్శి నర్సింహ కార్మికులు పాల్గొన్నారు.

**మక్తల్:** పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మండలంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట చేపడుతున్న సమ్మె శనివారంతో పదోరోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్మికులకు పనికితగ్గ వేతనం చెల్లించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కిరణ్, వెంకటేష్, భగవంతు, రాంచంద్రి, నర్సింహ, నారాయయణ, కార్మికులు శ్రీనివాసులు, నర్సింహ, కిష్టప్ప, సాయన్న, నర్సప్ప, రాజు, అంజనేయులు, రాములు, బాల్‌రాజు పాల్గొన్నారు.

**మాగనూర్:** కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కో– కన్వీనర్ పి. ఆంజనేయులు డిమాండ్ చేశారు. కార్మికుల సమ్మె పదోరోజు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కొనసాగింది. ఈ సందర్భంగా కార్మికులు వంటవార్పు నిర్వహించి ప్రభుత్వానికి నిరసన వ్యక్త పరిచారు. వర్కర్స్ యూనియన్ నాయకులు సురేష్ మాట్లాడుతూ.. తమ న్యాయపరమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి పీఎఫ్, ఈఎస్ఐ ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని తెలపారు. వెంకటప్ప, రాకేష్, నర్సింహ, ఆశప్ప, మారెప్ప, కొండన్న, వడ్వాట్ మారెప్ప, శివప్ప తదితరులు పాల్గొన్నారు.

**ఊట్కూరు:** పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కరించాలని మండలంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట చేపడుతున్న సమ్మె శనివారంతో పదోరోజుకు చేరింది. కనకప్ప, సత్యనారాయణ, ఉదయ్‌కుమార్, పరుషరాం పాల్గొన్నారు.

**నర్వ:** కార్మికులు పదోరోజు నిరవధిక సమ్మెలో భాగంగా మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పదిరోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. వెంటనే కార్మికుల న్యాయబద్ధమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాంచంద్రి, నర్సోజీ, నర్సింహులు గౌడ్, ఆనందం, భాగ్య, చిన్నయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

**దామరగిద్ద:** కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని వ్య.సా.కా జిల్లా కార్యదర్శి గోపాల్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల సమ్మెకు శనివారం వారు మద్దతు ప్రకటించి మాట్లాడారు.. ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించి కనీస వేతనం రూ. 19వేలివ్వాలని ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వెంకటప్ప, హన్మంతు, మోహన్, శ్రీనివాస్, కాశప్ప, శివానంద్, వెంకటప్ప పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### పోలింగ్ బూత్ ఏర్పాట్ల పరిశీలన



**కృష్ణా:** మండలంలోని ఖాన్‌దొడ్డిలో నూతనంగా పోలింగ్ బూత్ ఏర్పాటును శనివారం ఆర్ఐ అమర్నాథ్‌రెడ్డి, వీఆర్ఏ వినోద్, సర్పంచ్ విజయలక్ష్మీ తిప్పయ్యలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గతంలో తాము పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేయడంతో వారు స్పందించి ఈరోజు అధికారులను పంపించారని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, పీవైఎల్ నాయకుడు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

### తిరుమలలో భజన మండలి



**మరికల్:** మండలంలోని పూసల్‌పహాడ్ గ్రామానికి చెందిన శ్రీనివాస భజన మండలి సభ్యులు శనివారం తిరుమల దేవస్థానంలో అఖండ భజన కార్యక్రమం నిర్వహించారు. పదిరోజుల పాటు తిరుపతిలో భజనలు, సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు భజన మండలి సభ్యులు లింగారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో చందుగౌడ్, నర్సింహులు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, మొగులయ్య, వెంకటేష్, తిరుమలయ్య పాల్గొన్నారు.

### బస్టాండ్‌లోకి బస్సులను అనుమతించాలి

**కోస్గి:** నూతనంగా నిర్మించిన బస్టాండ్‌లోకి బస్సులను అనుమతించడంతోపాటు త్వరితగతిన మిగిలిన మూత్ర శాలలు, ఇతర పనులు పూర్తి చేయాలని కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బస్టాండ్‌లో సీసీ బెడ్ పనులు పూర్తి చేసినప్పటికీ బస్సులను ప్రధాన రోడ్డుపై నిలిపి ప్రయాణీకుల రాకపోకలు చేపట్టడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. అధికారులు స్పందించి నూతన బస్టాండ్‌లోకి బస్సులను అనుమతించాలని సూచించారు.

### వర్షం కోసం పూజలు



**మరికల్:** వర్షాలు సమృద్ధిగా కురువాలని మండలంలోని శనివారం రైతులు ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కాడెద్దుల ఎడ్లబండ్లతో కృష్ణానది పుణ్యక్షేత్రానికి వెళ్లి నీటిని తెచ్చి గ్రామ దేవతకు జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వేణు, రాము, బుచ్చిరెడ్డి, బాల్‌రాజ్, శ్రీను, రాజు, లక్ష్మయ్య, నర్సింహులు, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

### 21న మండల సమావేశం

**మాగనూర్:** ఈ నెల 21న ఎంపీపీ శ్యామలమ్మ అధ్యక్షతన మండల ఎంపీడీఓ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, ఇతర శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

### చంద్రశేఖర్‌రెడ్డికి సన్మానం

**మక్తల్:** నియోజకవర్గానికి చెందిన అమెరికాలో టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్‌కోర్ కమిటీ సభ్యుడిగా ఎన్నుకోబడిన పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డిని శనివారం మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ వాకిటి శ్రీహరి శాలువాతో సన్మానం చేశారు.

### ఎండుతున్న మొక్కలు



**ధన్వాడ:** గ్రామ పంచాయతీ సిబ్బంది సమ్మెలో ఉండటంతో గ్రామాల్లో నాటిన మొక్కలు ఎండుతున్నాయి. రోడ్డుకు ఇరువైపుల ఉపాధిహామీకూలీలతో అధికారుల మొక్కలు నాటించారు. వాటికి నీరు పోసేవారు లేకపోవడంతో ఎండిపోతున్నాయి. అధికారులు స్పందించి నాటిన మొక్కలను సంరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.